





గోదావరిలో గాలించి వలలో ఒడ్డుకు తెచ్చిన యువకుడి మృతదేహం

ప్రాణాలు తీసిన ఈత సరదా

- గోదావరిలో ముగ్గురు గల్లంతు
- ఇద్దరి మృతదేహాలు లభ్యం
- మరొకరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు
- ఇద్దరిది రావులపాలెం.. మరొకరిది విజయనగరం
- బంధువుల ఇంటికి వచ్చి మృత్యువాత
- తీవ్ర విషాదంలో కుటుంబ సభ్యులు
- రావులపాలెం గౌతమి పాత బ్రిడ్జి సమీపంలో ఘటన
- ఇటీవలే వాడపల్లి గుడికి వెళ్లి వస్తూ ముగ్గురు
- మడికి గ్రామ మహిళలు గోదావరిలో గల్లంతు
- గోదావరిలో వరుస ఘటనలతో ఆందోళన

వాళ్లు కాస్త తగ్గారు!

- జిల్లావ్యాప్తంగా మొత్తం 1,32,477 మంది మహిళలు పోలింగ్‌కు దూరం
- జిల్లాలో తగ్గిన మహిళా ఓటింగ్
- ఎవరికి నష్టమో అంటూ విశ్లేషణలు

అమలాపురం టౌన్, మే18: సార్వత్రిక ఎన్నికల్లో పురుషులకంటే మహిళా ఓటర్లే ఎక్కువ. పోలింగ్‌కు వచ్చేసరికి పురుషులకంటే మహిళల ఓటింగ్ శాతం తగ్గిపోవడం రాజకీయ పార్టీల నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది. తగ్గిన మహిళా ఓటింగ్ శాతం మాకంటే మాకు మేలు చేకూరుస్తుందని ఆయా పార్టీల నాయకులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం మహిళలకే సంక్షేమ పథకాల లబ్ధి అందజేసింది. మహిళా ఓటర్లంతా మా వెనుకే ఉన్నారని ఇప్పటి వరకు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. తీరా పోలింగ్ పూర్తయ్యేసరికి మహిళా ఓటర్లు ఎందరో ఎందుకు ఆసక్తి చూపించలేదన్న చర్చ జిల్లాలో నియోజకవర్గాల వారీగా జరుగుతోంది. జిల్లాలో 7,72,285 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 6,39,808 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,32,477 మంది మహిళలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 83.84 శాతం పోలింగ్ నమోదైనప్పటికీ మహిళా ఓటింగ్ ఎందుకు తగ్గిందన్న చర్చతో పాటు ఏ పార్టీని కొంప ముంచుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అత్యధికంగా ముమ్మిడివరం నియోజకర్గంలో 21,958 మంది మహిళలు పోలింగ్‌కు దూరంగా ఉంటే, మండపేటలో అత్యల్పంగా 15,528 మంది మహిళలు ఓటేయలేదు.

- రామచంద్రపురం నియోజకవర్గంలో 1,02,524 మంది మహిళా ఓటర్లు ఉంటే 86,487 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 16,039 మంది ఓటేయలేదు.
- ముమ్మిడివరంలో 1,23,170 మంది మహిళా ఓటర్లకుగాను 1,01,212 మంది ఓటువేయగా 21,958 మంది పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్నారు.
- అమలాపురంలో 1,07,239 మంది మహిళా ఓటర్లకుగాను 86,837 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 20,402 మంది ఓటు వేయలేదు.
- రాజోలులో 1,00,112 మంది మహిళా ఓటర్లకుగాను 79,048మంది ఓటుహక్కును వినియోగించుకోగా 21,064 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు.
- పి.గన్నవరం నియోజకవర్గంలో 98,653 మంది మహిళా ఓటర్లకుగాను 81,279 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 17,374 మంది మహిళలు ఓటు వేయలేదు.
- కొత్తపేటలో 1,27,324 మంది మహిళా ఓటర్లకు గాను 1,07,210 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 20,114 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు.
- మండపేట నియోజకవర్గంలో 1,13,263 మంది మహిళా ఓటర్లకుగాను 97,735 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 15,528 మంది మహిళలు ఓటేయలేదు.


పొలాల్లో పట్టాలు.. లబ్ధిదారులకు కష్టాలు!





ఇందుపల్లిలో మెరక చేయని జగనన్న లేఅవుట్.. పాశర్లపూడిలంకలో వర్షం వస్తే జగనన్న కాలనీ దుస్థితి ఇదీ (ఫైల్‌ఫొటో)

- సొంతింటి కలను ఆదిలోనే తుంచేశారు
- జగనన్న లేఅవుట్ల పేరిట హడావుడి
- పట్టాలిచ్చి పట్టించుకోవడం మానేశారు
- మౌలిక వసతులూ గుండు సున్నా
- చాలాచోట్ల మొదలుకాని నిర్మాణాలు
- కట్టుకున్నచోట్లా సమస్యల వలయం
- వేసవి దాటితే మెరక చేయడం అసాధ్యం
- ఇవేం కాలనీలంటూ జనం గగ్గోలు



అదిగో.. ఆ కాల్వ దాటిన తర్వాత పొలమే అమలాపురం మండలంలోని తాండవపల్లిలో జగనన్న లేఅవుట్. ఎప్పుడు మెరక చేస్తారో!

పేదలకు ఇళ్లు కాదు, ఏకంగా కాలనీలే ఇస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వం చేసిన హడావుడి అంతాఇంతా కాదు. అది కూడా తామే నిర్మించి ఇస్తామని సీఎం జగన్ ఉపన్యాసాల్లో దంచేశారు. చివరకు ఈ ఇళ్ల నిర్మాణం తాము చేపట్టలేమని, ప్రభుత్వ సాయంతో మీరే కట్టుకోవాలంటూ మెలిక పెట్టారు. ఈలోపు భూసేకరణ పేరుతో వైసీపీ నేతలు అందినకాడికి దోచుకున్నారు. తీరా పట్టాలు ఇచ్చిన స్థలంలో ఇళ్లు కట్టుకోవడానికి కొందరు రంగంలోకి దిగితే వారు పడిన, పడుతున్న కష్టాలు మామూలుగా లేవు. వర్షం వస్తే నరకమే చూస్తున్నారు. ఎందుకు ఇంటి నిర్మాణంలోకి దిగాంరా బాబూ అనుకునే స్థితికి లబ్ధిదారులు వచ్చారు. ఆ పరిస్థితి కూడా అక్కడక్కడే. జిల్లాలో సగానికిపైగా కాలనీల్లో మెరక చేయలేదు. దాంతో ఒక్క ఇంటి నిర్మాణం కూడా మొదలుకాలేదు. చెప్పాలంటే వీటి సంగతిని వైసీపీ ప్రభుత్వం ఎప్పుడో పట్టించుకోవడం మానేసింది. కనీసం అధికారులైనా ఇక్కడ లబ్ధిదారులు పడుతున్న అవస్థలను పట్టించుకుంటే కాస్తయినా మేలు జరుగుతుంది.

అమలాపురం పరిధిలో అంతా అస్తవ్యస్తం.. పట్టించుకునే తీరిక ఎవరికీ లేదు..

అమలాపురం రూరల్, మే 18: వందలాది ఎకరాల్లో జగనన్న కాలనీలు నిర్మిస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వం చెబుతూ వచ్చింది. కానీ కాలనీల కోసం భూసేకరణ చేసినప్పుడు చేసిన హడావుడి తర్వాత తగ్గుతూ వచ్చింది. ఎందుకంటే భూసేకరణలో వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలు కోట్లాది రూపాయలను వెనకేసుకున్నారు. ముందుగానే తమ బినామీల చేత పొలాలు కొనిపించి వాస్తవ ధరకు రెండు రెట్లు పెంచి ప్రభుత్వానికి ఆ భూములను దఖలు పరిచారు. తర్వాత మెరక పేరుతో ప్రభుత్వ భూముల్లోని మట్టి, గ్రావెల్‌నే తరలించి అందినకాడికి మరోసారి దోచుకున్నారు. తర్వాత ఇళ్ల కాలనీల వైపు చూడడం మానేశారు. ఆ ఇళ్ల స్థలాలపై ఎంతో ఆశ పెట్టుకున్న వారంతా ఇప్పుడు నానా అవస్థలూ పడుతున్నారు. అమలాపురం పట్టణ పరిసర గ్రామాలకు చెందిన నిరుపేదలకు నాలుగేళ్ల కిందటే ఇళ్ల స్థల పట్టాలు అందజేశారు. సేకరించిన స్థలాల్లో మెరక పనులు పూర్తిచేయకపోవడంతో గృహ నిర్మాణాలు ప్రారంభం కాలేదు. కొన్నిచోట్ల మెరక పనులు చేసి లేఅవుట్ చేసినా గృహనిర్మాణాలకు అనువుగా లేని దుస్థితి. మండల పరిధిలోని ఇమ్మిడివరప్పాడులో 5.32 ఎకరాల మెరక భూమిలో మూడేళ్ల కిందట లేఅవుట్ చేశారు. 210 మందికి ఇళ్ల స్థల పట్టాలిచ్చారు. విద్యుత్ స్తంభాలు, బోర్లు ఏర్పాటుచేశారు. వీటిలో 190 మంది ఈదరపల్లి లబ్ధిదారులకు ఇక్కడ పట్టాలు ఇవ్వగా మిగిలిన 20 స్థానికులకు పట్టాలుగా అందించారు. వీరిలో 95 శాతం మంది గృహనిర్మాణాలకు శంకుస్థాపనలు కూడా చేసుకున్నారు. అయితే గృహ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ తరలించుకునే దారి లేకపోవడంతో ఆ లేఅవుట్ నిరుపయోగంగా మారిపోయింది. ఇక ఇందుపల్లిలో 2.50 ఎకరాల భూమిని జగనన్న లేఅవుట్‌కు కేటాయించారు. మెరక పనులు చేసే ప్రయత్నాలు మరిచిపోయారు. ఇదే స్థలాన్ని గతంలో అమలాపురం పురపాలక సంఘం డంపింగ్ యార్డుకు కేటాయించారు. మళ్లీ అదే ప్రయత్నాల్లో ఉన్నట్టు సమాచారం. దాంతో ఈ లేఅవుట్‌కూ మంగళం పాడేసినట్టే. బండారులంకలో పేదల ఇళ్ల స్థలాల కోసం పది ఎకరాల భూమిని అప్పర్‌కౌశిక మేజర్ డ్రెయిన్ చెంతన సేకరించారు. గోదావరికి వరద పోటు తగిలితేచాలు లేఅవుట్‌కు సేకరించిన స్థలం ముంపు బారినపడుతుంది. మెరక పనులు చేపడతామని అంచనాలు రూపొందించారు. కొంతమేర పనులు చేసి బిల్లులు కూడా తీసుకున్నారు. అయినా నేటికీ ఒక్క ఇల్లు కూడా నిర్మించుకోలేని దుస్థితి. ఇక నడిపూడి తదితర గ్రామాలకు చెందిన పేదలకు తాండవపల్లిలో 31 ఎకరాల భూమిని సేకరించారు. మెరక పనులు కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే లబ్ధిదారులకు ఇంటి స్థలంతో పాటు గృహనిర్మాణ రుణాన్ని సైతం పెంచి ఇస్తారన్న కొత్త ఆశతో ఉన్నారు. ఈదరపల్లిలో అప్పర్ కౌశిక డ్రెయిన్‌ను ఆనుకుని శ్మశాన వాటిక చెంతన మత్స్యశాఖ అధీనంలో ఉన్న భూమిని సేకరించారు. చేప పిల్లల పెంపకానికి ఉన్న చెరువులన్నింటినీ పూడ్చి మెరక పనులు పూర్తి చేశారు. ఆ భూమి మత్స్యశాఖకు సంబంధించినదని, మత్స్యకారుల జీవనోపాధి ఆధారపడి ఉందంటూ కోర్టుకు వెళ్లడంతో రెండేళ్ల కిందట లేఅవుట్ చేసిన స్థలంలో ఒక ఇల్లు కూడా నిర్మించలేదు.

అంబాజీపేటలో..

కాలనీల్లో పిచ్చిమొక్కలకు నిలయం



గంగలకుర్రు అగ్రహారంలో జగనన్న ఇళ్ల స్థలాలు ఇలా

అంబాజీపేట, మే 18: మండలవ్యాప్తంగా 1211 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను మంజూరు చేశారు. మండలంలోని గంగలకుర్రు అగ్రహారం, వాకలగరువు, ఇసుకపూడి, చిరతపూడి, పుల్లేటికుర్రు గ్రామాల్లో స్థలాలు కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించారు. గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని పదకొండు ఎకరాలు ప్రైవేట్ వ్యక్తుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి మండలంలోని గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, మాచవరం గ్రామాల్లోని లబ్ధిదారులు సుమారు 400 మందికి పైగా ఇళ్ల పట్టాలను అందించారు. ఈ స్థలాలు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు ఒక్కరూ ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేయలేదు. అలాగే వాకలగరువులో సుమారు మూడు ఎకరాలు కొనుగోలు చేసి వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు అందించారు. పుల్లేటికుర్రు, ఇసుకపూడి, చిరతపూడి గ్రామాల్లో కొనుగోలు చేసిన భూమిలో ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు అందించారు. అయితే ఈ కాలనీలు వర్షాకాలం ముంపునకు గురవుతున్నాయి. దాంతో ఇళ్ల నిర్మాణానికి ఎవరూ ముందుకు రావడం లేదు.



మండపేటలో..

ఊరికి దూరంగా.. ప్రజలకు భారంగా..

మండపేట, మే18: మండపేట పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు వేములపల్లిలో 130 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి 4880 మందికి పట్టాలు అందజేశారు. అలాగే మండపేట రూరల్‌లో పలు గ్రామాల్లో 95 ఎకరాలను లబ్ధిదారులకు అందించారు. అర్బన్‌కు సంబంధించి 446, రూరల్‌కు సంబంధించి 660 గృహలు మాత్రమే జగనన్నకాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో నిలిచిపోయి ఉన్నాయి. ముఖ్యంగా మండపేట పట్టణ వాసులకు ద్వారపూడిలో ఇళ్ల స్థలాలను కేటాయించడంతో పది కిలోమీటర్ల దూరంలో ఉండే ఆ స్థలాలకు రోజు పనులు చేసుకునే వారు ఎలా వెళతారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. అలాగే కాలనీల్లో మౌలిక సదుపాయాలు ఎక్కడా కల్పించలేదు.

ముమ్మిడివరంలో..

చాలీచాలని నిధులు.. అరకొర వసతులు



సీహెచ్ గున్నేపల్లిలో ఖాళీగా ఉన్న జగనన్న లేఅవుట్

ముమ్మిడివరం, మే 18: ముమ్మిడివరం నగర పంచాయతీ, మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు సంబంధించి 2020-21 సంవత్సరంలో 79.12 ఎకరాల భూమిని 3471 మందికి జగనన్న ఇళ్లకాలనీల పథకంలో పట్టాలిచ్చారు. స్థానిక నాయకుల సిఫార్సుతో ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేని భూమిని లక్షలు ఖర్చుచేసి కొనుగోలు చేశారు. చాలాచోట్ల పల్లపు భూమిని ఊరికి దూరంగా ఉన్న భూమిని పట్టాలుగా ఇచ్చారు. ఈ లేఅవుట్‌లో ఇప్పటివరకు కేవలం 451 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మంచినీరు, డ్రైన్లు, విద్యుత్ సౌకర్యాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో జగనన్న కాలనీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నగరపంచాయతీ పరిధిలో 26.65 సెంట్ల భూమిని 1314 మందికి పట్టాలుగా ఇచ్చారు. ఆ ఐదు లేఅవుట్లలో నాలుగు లేఅవుట్లలో మాత్రమే 190 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మండలంలో 12 గ్రామ పంచాయతీల పరిధిలో 35 లేఅవుట్లలో 14 లేఅవుట్లలో 261 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కొన్ని లేఅవుట్లలో ఒకరిద్దరు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో విద్యుత్, సరైన సౌకర్యాలు లేక వారు బిక్కుబిక్కుమంటు కాలక్షేపం చేస్తున్నారు. సీహెచ్ గున్నేపల్లి లేఅవుట్-1లో 2 ఎకరాల 39 సెంట్ల భూమిని వంద మందికి పట్టాలుగా ఇవ్వగా ఆ భూమి లోలెవెల్‌లో ఉండడంతో వర్షం వస్తే మునిగిపోతోంది. క్రాప చింతలపూడిపాలెంలో లేఅవుట్‌కు వెళ్లే దారి సరిగా లేదు. మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు కూడా లేవు. లంకాఫ్ రాణేలంక-2 లేఅవుట్‌లో 3 ఎకరాల 40 సెంట్లను 146 మందికి పట్టాలుగా ఇచ్చారు. వరదలు వస్తే ఈ భూమి మునిగిపోతుంది. ఎత్తులో ఇళ్లు నిర్మించుకోవాలంటే గృహనిర్మాణ పథకంలో ఇచ్చే రూ.లక్షా 80 వేలు బేస్‌మెంట్‌కే సరిపోదు.

మామిడికుదురులో..

మెరక పని మొదలయ్యేదెప్పుడు.. ఇళ్ల నిర్మాణం ఎప్పుడు...

మామిడికుదురు, మే 18: జగనన్న లేఅవుట్లు ఏర్పాటుచేశారుగాని మౌలిక వసతుల మాట మరిచారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మండలంలో 22 లేఅవుట్లు ఏర్పాటుచేసి 1,645 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. దీంట్లో 134 మంది ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మించుకోవడానికి పనులు ప్రారంభించారు. వీటిలో 70 గృహ నిర్మాణాలు పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. జగన్ ప్రభుత్వం ఒక్క ఇంటికి కూడా రుణం కేటాయించకపోవడంతో ఐదు సంవత్సరాలపాటు లబ్ధిదారులు ఎదురు చూపులు చూశారుతప్ప ఇంటి రుణం మంజూరు కాలేదు. కొన్ని లేఅవుట్లు పల్లపు ప్రాంతాల్లో ఉండడం వల్ల వర్షం వస్తే నీట మునిగి తేలుతున్నాయి. కొన్నిచోట్ల విద్యుత్, మంచినీరు, రోడ్లు తదితర ఏర్పాట్లు పూర్తి చేయలేదు. అంతేకాకుండా ఒక గ్రామంలో వారికి వేరొక గ్రామంలో పట్టాలు ఇవ్వడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మాణానికి ముందుకు రావడం లేదు.

మౌలిక సదుపాయాల మాటే మరిచారు..



ఆత్రేయపురంలో ఖాళీగా ఉన్న జగనన్న ఇళ్ల స్థలాల లేఅవుట్

ఆత్రేయపురం/అల్లవరం/ద్రాక్షారామ/రాయవరం/కపిలేశ్వరపురం, మే18: ఆత్రేయపురంలో 11.15 ఎకరాల్లో 346 మంది లబ్ధిదారులకు ఎన్నికల ముందు హడావుడిగా లబ్ధిదారులకు సెంటుపావు స్థలం అందించారు. లొల్లలో 7.32 ఎకరాల్లో వాడపల్లి, లొల్ల, మెర్లపాలెంకు చెందిన 288 మందికి పట్టాలు ఇచ్చారు. పేరవరంలో 7.53 సెంట్లలో 314 మందికి, వద్దిపర్రులో 8.90 ఎకరాల్లో 332 మందికి, నార్కెడుమిల్లిలో 9.56 ఎకరాల్లో 402 మందికి, ర్యాలిలో 18.85 ఎకరాల్లో 715 మందికి పట్టాలు ఇచ్చారు. ర్యాలి, రాజవరం, పేరవరం గ్రామాల్లో లేఅవుట్లలో కొద్దిమంది మాత్రమే గృహాలు నిర్మించుకోగా సౌకర్యాలు లేక ఇబ్బందులుపడుతున్నారు. అల్లవరం మండలంలో సుమారు రూ.56 కోట్లు వెచ్చించి ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసినా చాలా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు జరగక జగనన్న లేఅవుట్ స్థలాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దూరంగా ఉన్న స్థలాలను పేదలకు ఇళ్లస్థలాల పట్టాలుగా ఇచ్చి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రామచంద్రపురం మండలం, పట్టణంలో జగనన్న కాలనీల నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి. మండలంలో ద్రాక్షారామ, భీమక్రోసుపాలెం, యనమదల, తాడిపల్లి, వెలంపాలెం, ఓదూరుకు సంబంధించిన లేఅవుట్లలో మెరక పనులు చేయాల్సి ఉంది. పట్టణానికి సంబంధించి వెల్లసావరం లేఅవుట్‌లో మెరక పనులు చేయాల్సిఉంది. ఇక ఆయా కాలనీల్లో ఎక్కడా రోడ్ల నిర్మాణం జరగలేదు. దీంతో మెటీరియల్ తరలించడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

రాయవరం మండలం వెదురుపాకలోని వెదురుపాక- ఆరికరేవుల రోడ్డులో లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చినప్పటికీ లేఅవుట్ స్థలంలో మెరక పనులు జరగకపోవడంతో ఒక్క ఇల్లూ నిర్మించలేదు. రెండున్నర ఏళ్ల కిందట పట్టాలు ఇచ్చినా ఎన్నికల ముందే మెరక చేసి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. దీంతో ఒక్క ఇంటి నిర్మాణం చేపట్టలేదు. మాచవరం గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో 215 మందికి స్థలాలు కేటాయించగా చాలామంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోగా సీసీ రోడ్లు, డ్రైన్ సౌకర్యం లేక కాలనీలో కొద్దిపాటి వర్షం వస్తే చెరువులా మారుతోందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. కపిలేశ్వరపురం మండలంలో 1032 ఇళ్ల స్థలాలకుగాను వాటిలో 575 ఇళ్లు నిర్మించగా, 167 ఇళ్లు గ్రౌండ్ కావాల్సి ఉంది. మిగిలినవి పలు దశల్లో ఉన్నాయి. కపిలేశ్వరపురం రామకృష్ణ నగర్ వద్ద 82 సెంట్ల స్థలంలో వల్లూరు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు 40 స్థలాలు కేటాయించినా అవి దూరంకావడంతో నిర్మాణానికి ఎవరూ ముందుకురాలేదు. అక్కడే 2 ఎకరాల్లో కేదార్లంక గ్రామస్తులకు 70 ప్లాట్లు కేటాయించగా ఆ స్థలాలు కోర్టు వివాదంలో ఉన్నాయి. అలాగే అద్దంకివారిలంకలో 2 లేఅవుట్లు, కాలేరులో 1 లేఅవుట్‌లు కూడా కోర్టు పరిధిలో ఉండడంతో ఖాళీగా ఉన్నాయి. నల్లూరులో 28 ప్లాట్లు ఇవ్వగా అవి పల్లంగా ఉండడంతో వర్షాలు వస్తే గృహాలు చుట్టూ నీరు నిలబడి ఇబ్బందులు పడుతున్నారు.



చెయ్యేరులో పార్కింగ్ స్థలాలు పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎస్పీ శ్రీధర్

25 నాటికి కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

నాలుగు పార్కింగ్ స్థలాల గుర్తింపు : కలెక్టర్

అమలాపురం టౌన్, మే 18: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 25 నాటికి కౌంటింగ్ రూమ్‌ల ఏర్పాట్లు పూర్తిచేయడం జరుగుతుందని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాల్లో శనివారం వాహనాల పార్కింగ్ ప్రదేశాల ఎంపిక ప్రక్రియను జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి కలెక్టర్ చేపట్టారు. కౌంటింగ్‌కు హాజరయ్యే ప్రభుత్వ సిబ్బంది, పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, ఇతర సిబ్బంది వాహనాల పార్కింగ్ కోసం ఆరు పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఇప్పటివరకు నాలుగు పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసినట్టు కలెక్టర్ తెలిపారు. శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో పార్లమెంటు నియోజకవర్గంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌ల సీల్డులను ఎస్పీతో కలిసి తొలుత ఆయన పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు రోజున పౌర జీవనానికి ఏవిధమైన ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి.కేశవర్ధనరెడ్డి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 6 వరకు సెక్షన్ 144 అమలు..

శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లావ్యాప్తంగా సెక్షన్ 144 అమలులో ఉంటుందని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షుశుక్లా తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల సమస్యలు, సంఘటనలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున జూన్ 6 వరకు ప్రజా ప్రశాంతత కోసం సెక్షన్ 144 అమలు చేస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ అనంతరం పలు జిల్లాల్లో చోటు చేసుకున్న అల్లర్ల నేపథ్యంలో ప్రశాంత జీవనానికి విఘాతం కలగకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సెక్షన్ 144 అమలు చేస్తున్నారన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు కౌంటింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల పరిధిలో మారణాయుధాలు, నలుగురు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడి ఉండరాదని, ఊరేగింపులు నిర్వహించరాదని ఆదేశించారు.

పెండ్లికొడుకాయనే
సత్యదేవుడి కల్యాణోత్సవాలు ప్రారంభం
7లో

ఘనంగా ప్రారంభమైన సత్యదేవుడి కల్యాణోత్సవాలు

సత్యదేవుడు పెండ్లికొడుకాయనే





పసుపు దంచుతున్న ముత్తైదువులు

అన్నవరం, మే 18:

సత్యదేవుడు పెండ్లికొడుకైన వేళ ప్రకృతి పులకించింది. రత్నగిరి శోభిల్లింది. సత్యదేవుడి సాప్తాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలలో భాగంగా తొలిరోజైన శనివారం సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మి అమ్మవార్లను పెండ్లికొడుకు, పెండ్లికుమార్తెలుగా చేసే కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. పిలిస్తే పలికే దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి క్రోధి నామ సంవత్సర దివ్య కల్యాణ మహోత్సవాలు శనివారం సాయంత్రం 4.30కి అనివేటి మండపంలో విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయ్యాయి. ముందుగా వివిధ సుగంధభరిత పుష్పమాలికలతో సర్వాంగసుందరంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై నవ వధూవరులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మరో వేదికపై పెండ్లిపెద్దలైన సీతారాములను ఆశీనులు గావించి ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాల అనంతరం ఉల్లూకల గౌరీపూజను నిర్వహించారు. చతుర్వేద పండితులు మహదాశీర్వచనం అందించిన పిమ్మట ముత్తైదువులు పసుపు దంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లకు దివ్యాభరణాలు ధరింపచేసి నుదుట తిలకం, బుగ్గనచుక్కతో అలంకరించారు. ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్‌లు పాల్గొనగా వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించారు.

హాస్యోక్తులతో ఎదుర్కోలు ఉత్సవం

సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా మొదటిరోజైన శనివారం రాజరామరాయ కళామందిరంలో నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం ఆద్యంతం హాస్యోక్తులతో సాగింది. స్వామివారి తరుపున ఛైర్మన్ ఐ.వి రోహిత్ కొందరు పండితులు అమ్మవారి తరపున ఈవో రామచంద్రమోహన్ మరి కొందరు పండితులు రెండు బృందాలుగా విడిపోయి స్వామిఅమ్మవార్ల కీర్తిప్రతిష్టలు, గుణగణాలు, వంశకీర్తి చలోక్తులతో కీర్తిస్తూ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లగ్నపత్రికలు ఒకరినొకరు మార్చుకుంటూ కల్యాణ శుభఘడియలు పండితుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



ఉల్లూకల గౌరీపూజను నిర్వహిస్తున్న పండితులు

వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములు

స్వామివారి దివ్య కల్యాణోత్సవ గ్రామోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన గ్రామోత్సవంలో వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములను ఊరేగించారు. ఆదివారం జరిగే స్వామివారి కల్యాణానికి గ్రామస్థులకు సీతారాములు ఆహ్వానించేందుకు ప్రతీకగా దీనిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు దివ్యకల్యాణం

సత్యదేవుడి వార్షిక దివ్యకల్యాణం ఆదివారం రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు 40 అడుగుల వెడల్పుతో వివిధ పుష్పమాలికలు, విద్యుద్దీప అలంకరణలతో కల్యాణ వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దారు. సుమారు 25 వేల మంది విచ్చేస్తారని అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కల్యాణవేడుక తిలకించేందుకు విచ్చేస్తారని అధికారులు తెలిపారు.



వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములు

పెదశేషవాహనంపై భావనారాయణస్వామి



పెదశేషవాహనంపై స్వామి,అమ్మవారు

సర్పవరం జంక్షన్, మే 18 : కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు భక్తుల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామికి సుప్రభాత సేవ, ప్రత్యేక అర్చనలు, హోమం, పలు రకాల విశేష ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివాహ మహోత్సవంలో భాగంగా స్వామివారిని మాఢ వీధుల్లో పెద శేషవాహనంపై ఊరేగించారు. ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సాయంత్రం కట్టా నూకరాజు బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేగుళ్ల, లీలాకృష్ణపై అట్రాసిటీ కేసు

కపిలేశ్వరపురం, మే 18: పోలింగ్ సందర్భంగా ఈనెల 13న వల్లూరులో జరిగిన ఘర్షణ నేపథ్యంలో కేసులు నమోదవుతున్నాయి. తమను కులం పేరుతో దూషించారని గ్రామానికి చెందిన పలివెల రోకేష్, నక్కా భాస్కరరావు, నక్కా అమ్మిరాజులు విడివిడిగా ఫిర్యాదులు అందజేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, స్థానిక టీడీపీ నాయకుడు వేగుళ్ల వీరబాబులపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

నో మేన్ జోన్‌గా 'నన్నయ'

దివాన్‌చెరువు, మే 18: జిల్లాలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భద్రపరచిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని నో మేన్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. దీంతో విశ్వవిద్యాలయంలోని రోజువారీ కార్యక్రమాలను జూన్ 6వ తేదీ వరకూ వర్సిటీ అధికారులు నిలుపుదల చేశారు. జిల్లాలోని రాజమహేంద్రవరం పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచగా భద్రతా బలగాలు 24 గంటలూ కాపలా కాస్తున్నాయి. అలాగే వర్సిటీ పరిధిలో 144 సెక్షన్ విధించారు. ఈ నేపథ్యంలో విశ్వ విద్యాలయాన్ని నో మ్యాన్ జోన్‌గా ప్రకటించారు. దీంతో శనివారం ఉదయం విధులకు హాజరైన బోధన, బోధనేతర సిబ్బంది గుర్తింపు కార్డులను వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద విశ్వవిద్యాలయ అధికారుల పర్యవేక్షణలో పోలీస్‌లు పరిశీలించి వారి వివరాలను ప్రత్యేక రిజిస్టరులో నమోదు చేసుకున్న అనంతరం విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వరకూ అనుమతించారు. అనంతరం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయంలోని రోజువారీ కార్యక్రమాలు 6వ తేదీ వరకూ నిలుపుదల చేశామని, సిబ్బందిని ఇంటి నుంచే పనిచేయాలని సూచించారు. అత్యవసర సమయంలో 15 మంది అధికారులు, ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు అనుమతించాలని జిల్లా అధికారులను కోరుతూ యూనివర్సిటీ అధికారులు లేఖ రాసినట్టు తెలిసింది.

జూన్ 6 వరకూ కార్యకలాపాలు నిలుపుదల: వీసీ

ఎన్నికల కారణంగా జిల్లా కలెక్టర్ సూచనల మేరకు నన్నయ యూనివర్సిటీలోని రోజువారీ కార్యక్రమాలను జూన్ 6వ తేదీ వరకూ నిలుపుదల చేశామని వీసీ కె.పద్మరాజు శనివారం తెలిపారు. ఈవీఎంలు, ఇతర ఎన్నికల పత్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కోసం కౌంటర్లు ఉన్న కారణంగా క్యాంపస్‌ను నో మ్యాన్ జోన్‌గా ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ప్రకటించారన్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

గోదావరిలో ముగ్గురు గల్లంతు

ఇద్దరి మృతదేహాలు లభ్యం

మరొకరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు



సంఘటన స్థలం వద్ద గుమిగూడిన స్థానికులు, బంధువులు



జయకుమార్ మృతదేహం



ఈశ్వరరెడ్డి మృతదేహం



సబ్బెళ్ల ఈశ్వరరెడ్డి



జయకుమార్



గోదావరిలో గల్లంతైన సంపతరెడ్డి

రావులపాలెం, మే 18: వాళ్లు ఐదుగురు స్నేహితులు.. సెలవులు కావడంతో సరదాగా బయటకు వెళదామనుకుని గోదావరి ఒడ్డుకు వచ్చారు. సరదాగా ఈత కొడదామనుకుని వారిలో నలుగురు గోదావరిలో దిగారు. అయితే దురదృష్టవశాత్తూ ముగ్గురు మునిగిపోయి గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యంకాగా, మరొకరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ విషాదకర సంఘటన శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి పాతబ్రిడ్జి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం చినవంతెన వద్ద ఉంటున్న సబ్బెళ్ళ ఈశ్వరరెడ్డి(20), అతని సోదరుడు సత్యనారాయణరెడ్డి, పిన్ని కొడుకు సత్తి సంపతరెడ్డి(16), అక్కడే నివాసం ఉంటున్న పెంటా జయకుమార్(19), కొమ్మర్తి రాజేష్ ఈ ఐదుగురు స్నేహితులు. కాగా సంపతరెడ్డి విజయనగరం నుంచి వేసవి సెలవులకు రావులపాలెం పిన్ని ఇంటికి వచ్చాడు. ఐదుగురు స్నేహితులు కలిసి మధ్యాహ్న సమయంలో గోదావరి స్నానం చేద్దామని గౌతమి గోదావరి పాతబ్రిడ్జి వద్దకు వెళ్లి అక్కడ నుండి ఇసుక మేటలో కిలోమీటరు మేర నడిచి నీటి ప్రవాహం వద్దకు చేరుకున్నారు. వీరిలో పెద్దవాడైన సత్యనారాయణరెడ్డికి ఈత రాకపోవడంతో గట్టున కూర్చుని ఉన్నాడు. మిగిలిన నలుగురు గోదావరిలో స్నానానికి దిగారు. కొంతసేపటికే అందరూ మునిగిపోయారు. వారిలో కొమ్మర్తి రాజేష్ కంగారుగా బయటకు వస్తుండటంతో అక్కడే ఉన్న సత్యనారాయణరెడ్డి ముగ్గురు గల్లంతయినట్లు గుర్తించి కేకలు వేశాడు. ఆ సమీపంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు వచ్చి గల్లంతైన వారి కోసం వెతికిన ప్రయోజనం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ఎం.ఆంజనేయులు, రెవెన్యూ, కొత్తపేట ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సబెళ్ళ ఈశ్వరరెడ్డి, పెంటా జయకుమార్, మృతదేహాలు లభ్యం కాగా గల్లంతైన సంపతరెడ్డి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతదేహాలను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆంజనేయులు, తహసీల్దారు అశోక్‌వర్మ తెలిపారు.

గుండెలవిసేలా రోదిస్తున్న సోదరుడు

ఐదుగురులోని ముగ్గురు అన్నదమ్ములు కాగా మరో ఇద్దరు స్నేహితులు. సబ్బెళ్ళ సత్యనారాయణరెడ్డి మృతిచెందిన సబ్బెళ్ళ ఈశ్వరరెడ్డిలు సొంత అన్నదమ్ములు కాగా వాళ్ళ పిన్ని కొడుకు సత్తి సంపతరెడ్డి వేసవి సెలవులు అని పెద్దమ్మ ఇంటికి రావులపాలెం వచ్చాడు. గోదావరి స్నానానికి వెళ్లిన సమయంలో తమ్ముళ్లు ఇద్దరు నదిలో గల్లంతు కావడంతో సత్యనారాయణరెడ్డి గుండెలవిసేలా రోదించాడు. ఈశ్వరరెడ్డి మృతదేహం లభ్యం కాగా సంపతరెడ్డి మృతదేహం కోసం గాలిస్తున్నారు. సత్యనారాయణరెడ్డి తండ్రి సూర్యనారాయణరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కంద అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం తీవ్రవిషాదంలో మునిగిపోయింది. వేసవి సెలవులకు వచ్చిన సంపతరెడ్డి గల్లంతవ్వడంతో విజయనగరంలో నివాసం ఉంటున్న తండ్రి దుర్గారెడ్డికి బంధువులు సమాచారం అందించారు. అక్కాచెల్లెళ్ల బిడ్డలు ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా ఒకరు గల్లంతు కావడంతో ఆ కుటుంబాలు రోదిస్తున్న తీరు స్థానికులను సైతం కంటతడిపెట్టించింది.

చేతికి వచ్చిన కొడుకు మృతిపై తండ్రి ఆవేదన..

రావులపాలెం చినవంతెన వద్ద నివాసం ఉంటున్న జయకుమార్ తండ్రి వడ్రంగి పనిచేస్తూ కొడుకును చదివిస్తున్నాడు. జయకుమార్ స్థానిక డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ ఖాళీ సమయంలో ఫొటో స్టూడియోలో పనిచేస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవ్వరివల్ల కాలేదు. కాగా సబ్బెళ్ళ ఈశ్వరరెడ్డి ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సంపతరెడ్డి 10వ తరగతి చదువుతున్నాడు.

గోదావరిలో వరుస ఘటనలతో ఆందోళన...

గోదావరిలో వరుస ఘటనలు జరగడంతో నదీ పరివాహక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆలమూరు మండలం మడికికి చెందిన ముగ్గురు మహిళలు వాడపల్లి వెంకన్న దర్శనానికి వెళ్తూ బడుగువారిలంక వాని వద్ద ముగ్గురు మృతిచెందిన సంఘటన మరువక ముందే ఐదు కిలోమీటర్ల దూరంలో వారం తిరగకుండా రావులపాలెం గౌతమి పాతబ్రిడ్జి వద్ద గోదావరిలో ఇద్దరు గోదావరిలో ఈతకు వెళ్లి మృతిచెందడం, మరొకరు గల్లంతు కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాలువలకు నీటిసరఫరా నిలుపుదల చేయడం వర్షాలు కురుస్తుండటంతో గోదావరి నీటి ప్రవాహం అధికంగా ఉండటమే ఈ ప్రమాదాలకు కారణమని స్థానికులు భావిస్తున్నారు. గోదావరి చెంతకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కిటకిటలాడిన 'వాడపల్లి'



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆత్రేయపురం, మే 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, చిర్ల జగ్గిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.42.14 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

సిట్ విచారణ పారదర్శకంగా జరగాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 18 : రాష్ట్రంలో ఎన్నికల అనంతరం చెలరేగిన హింస నేపథ్యంలో ఏర్పాటైన సిట్ విచారణ అత్యంత పారదర్శకంగా జరగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. భారత దేశ ఎన్నికల చరిత్రలో రాష్ట్రంలో ఇలాంటి హింస ఎన్నడూ జరగలేదన్నారు. అత్యున్నత పోలీస్ అధికారులు పలువురు సస్పెండ్ కావడం, కలెక్టర్లు, ఇతర ఐపీఎస్ అధికారులు బదిలీ కావడం ఎన్నడూ లేదన్నారు. అధికార పార్టీకి కొందరు ఐపీఎస్‌లు తొత్తులుగా మారడం వల్లే ఇదంతా జరిగిందని, పోలీస్ అధికార వ్యవస్థ దీన్ని చూసి సిగ్గుపడాలన్నారు. గోదావరి నడిబొడ్డున అక్రమంగా ఎంత ఇసుక తవ్వుతున్నారో అందరికీ తెలుసని, ఇసుక అక్రమాలు, అక్రమ సంపాదనపై కొత్త ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి పార్టీ ఓటమి ఖాయమని, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి ఓడిపోతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీ రామారావు దేశంలో లౌకిక వ్యవస్థను గట్టిగా విశ్వసించారని, ఇప్పుడున్న నాయకులు కూడా లౌకిక రాజ్యాంగంపై పోరాడాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నాయకులకు తప్పనిసరిగా విజన్ ఉండాలి

మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

రాజానగరం, మే 18 : ఉపాధ్యాయ వృత్తిలో నాయకులుగా రాణించాలంటే విజన్ ప్రధానంగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం సమీపంలోని గైట్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రోపాధ్యాయ (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహారెడ్డి నాయకత్వ లక్షణాలపై ప్రసంగించారు. నాయకులు సర్వనైపుణ్యాల సమ్మేళనమైతే బాగా రాణిస్తారన్నారు. నాయకుడిగా ఎదిగిన ఉపాధ్యాయుల్లో దేశాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసినవారు ఎందరో ఉన్నారన్నారు. నాయకుడు నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావం వంటి లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. అటువంటి ఉపాధ్యాయులే ఉత్తమ లీడర్లుగా ఎదుగుతారని చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యారంగ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పలు సంస్కరణలు తీసుకొచ్చేందుకు యోచిస్తున్నామన్నారు. అనంతరం పెన్షన్ నిబంధనలపై ఎం.రఘునాథరెడ్డి, ఏపీఎస్‌టీఎఫ్ పాత్ర ఉద్యమాల నిర్వహణ అంశంపై ఏపీఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ప్రాతినిధ్యాలు, రాయబారాలు, ఆర్థిక వ్యవహారాలపై ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకుడు రాజుల నాగేశ్వరరావు ప్రసంగించారు. శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిసినందున ఎస్టీయూ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డానియేల్‌బాబు, లక్ష్మణ, దొరబాబు, పల్లంరాజు, మోర్త శ్రీను, కాశీవిశ్వనాథ్, రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివ ప్రసాద్, ఉపాధ్యక్షుడు జాకబ్, మహిళా నాయకులు శైలజా భవాని, సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌జే త్రినాథ్‌బాబు, బి.ధర్మరాజు, సుబ్రహ్మణ్యం, శామ్యూల్‌సన్, వైవీవీ సత్యనారాయణ, సత్తిరాజు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్‌కు 1060 మంది హాజరు

మొత్తం 95.24 శాతం నమోదు

జేఎన్టీయూకే, మే 18: కాకినాడ జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి శనివారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 1113 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1060 మంది హాజరయ్యారని, 53 మంది గైర్హాజరు కాగా 95.24 శాతం హాజరు నమోదైందని కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షకు 950 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 918 మంది హాజరయ్యారని, 32 మంది పరీక్ష రాయలేదని మొత్తం 96.63 శాతం హాజరు నమోదైందని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 345 మంది హాజరు కావాల్సి ఉండగా 341 మంది హాజరయ్యారని నలుగురు గైర్హాజరు కాగా మొత్తం 98.84 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు శనివారం ఉదయం సెషన్ మాత్రమే జరిగాయని ఈనెల 23 వరకూ కొనసాగుతాయన్నారు.

తెలంగాణ ఈఏపీ సెట్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ



ఎస్.రాధాకృష్ణ



సాకేత్‌రాఘవ్

రాజమహేంద్రవరం రూరల్, మే 18: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈఏపీ సెట్ పరీక్షల్లో రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారని ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తమ విద్యార్థి ఎస్.రాధాకృష్ణ స్టేట్ 2వ ర్యాంక్, ఎస్.సాకేత్ రాఘవ్ స్టేట్ 4వ ర్యాంక్, పి.శివసంపత్ నాయుడు స్టేట్ 25వ ర్యాంక్, వీఎస్‌జీఎన్‌వీ రామకృష్ణారెడ్డి స్టేట్ 53వ ర్యాంక్, వి.అభిశ్యామ్ స్టేట్ 64వ ర్యాంక్, డి.ప్రభాస్ స్టేట్ 91వ ర్యాంక్ సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

శనేశ్వర ఆలయం కిటకిట



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట, మే 18: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,43,585 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

పంట కాల్వలపై వంతెనలు నిర్మించాలి

మండపేట, మే 18: తాపేశ్వరం, ద్వారపూడి మధ్య రోడ్డు పనులు పూరి చేసిన అధికారులు, సత్వరమే పంట కాల్వలపై శిథిలావస్థకు చేరిన వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దూళి జయ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం పంట కాల్వలు మూసివేసిన నేపథ్యంలో సత్వరమే పంటకాల్వలపై కల్వర్టుల పనులు చేపట్టాలని కోరారు.

ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి






ఆలమూరులో వాసవీకన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు, మండపేట: వాసవీమాత గ్రామోత్సవం, ఆత్రేయపురం:వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు

ఆలమూరు, మే 18: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవికన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆలమూరు జనార్ధనస్వామి ఆలయంలో కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూలు, కుంకుమార్చనలు చేశారు. కాళ్లకూరి సూరిపండు పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేక రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన వెత్సా సూర్యగుప్తా పూజా కార్యక్రమాలు, భక్తులకు అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. చింతలూరు, పెదపళ్ల గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘం కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఆలమూరు, చింతలూరు, పెదపళ్ల ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మండపేట: వాసవిమాత అమ్మవారి జయంతి వేడుకలు మండపేట పట్టణం, పలుగ్రామాల్లో వైశ్య సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండపేటలో వైశ్య సంఘ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ద్వారపూడిలో అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఆత్రేయపురం: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి 1021జయంతి సందర్భంగా దశమి శనివారం ఆత్రేయపురం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వాసవిమాతకు కుంకుమ పూజలు నిర్వహించారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదవితరణ చేశారు.

రాయవరం: వెదురుపాక, రాయవరం గ్రామాల్లో వాసవి మాత జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాయవరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమ్మవారికి పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. వెదురుపాకలో అమ్మవారికి పల్లకి ఉత్సవం, మహిళలు అమ్మవారికి సామూహిక అర్చనలు జరిపారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గ్రంధి వీరభద్రరావు, బొడ్డు గోవర్ధన



అంబాజీపేట: పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కృష్ణుడు, దిగవల్లి వీరవెంకట చంద్రశేఖర రామకృష్ణ, బొడ్డు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్కి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవార్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

రాజోలు: రాజోలులో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు చేసి లలితా సహస్ర పారాయణం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కుల దైవమైన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజును అత్యంత వైభవంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రాజోలు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, మహిళా సంఘం అధ్యక్షుడు కాసు భవానీ, సెక్రటరీ కొత్త పద్మావతి, వాసవిక్లబ్ రీజియన్ ఛైర్మన్ రాజానాగరత్నకుమార్, వాసవిక్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాసరంగనాయకమూర్తి, వాసవి వనితాక్లబ్ అధ్యక్షురాలు గెల్లి అన్నపూర్ణ, కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లిలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 500మంది ఆర్యవైశ్య భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం అర్చకులను ఘనంగా సన్మానించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం గణపతిపూజ, అనంతరం అమ్మవారికి అభిషేకం, పుణ్యాహవచనం, చండీహోమం, చండీ పారాయణం, శ్రీచక్రనవావర్ణార్చన, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. సాయంత్రం పుష్పాలంకృతమైన రథంపై అమ్మవారి గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.




ద్రాక్షారామ: అమ్మవారి గ్రామోత్సవం రాజోలు: కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



అమలాపురం రూరల్, మే 18: బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి తీర్థ కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి వాహనోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం కలశ స్థాపన జరుగుతుందని శ్రీశ్రీనివాసా బాలమిత్రసంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, లక్కింశెట్టి ఫణిరాజులు తెలిపారు. జూన్ 1వరకు జరిగే కల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల25న రాత్రి 8.05గంటలకు స్వామివారి దివ్యకల్యాణం 26నపుష్పయాగం, 27న శ్రీలక్ష్మీగణపతి హోమం, భూవరాహ స్వామివారి హోమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం జరుగుతుంది. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి వాహనోత్సవాన్ని పురవీధుల మీదుగా సాగించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు ఫణిరాజు-హేమనాగలక్ష్మి దంపతులు సంప్రోక్షణ నిర్వహించారు. వెయ్యి మందికి అన్నసమారాధన నిర్వహించారు. మురుగులమ్మ గుడిసెంటర్ యూత్ ఆధ్వర్యంలో వాహన సేవను నిర్వహించగా అంకం నాగసత్యనారాయణ, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, నల్లా శేషయ్య, కాశిన ప్రసాద్, దైవపు ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



అంబాజీపేట, మే 18: అంబాజీపేట శివారు కొర్ల పాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణతో వెంకన్న కల్యాణం జరిగింది. ఆలయ ప్రాంగణమంతా వందలాది మంది మహిళలు స్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. తొలుత స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. శ్రీవేంకటేశ్వరస్వామికి బండారులంక లేఅవుట్ సిండికేట్ సభ్యులు, భక్తులు రూ.1.10లక్షలు విలువైన వెండికిరీటాన్ని బహూకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ నిర్వహించి స్వామివారికి కిరీటాన్ని అలంకరించారు.

నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలి

మలికిపురం, మే 18: ప్రభుత్వం నిబంధనలు సడలించి రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలుగుదేశం, జనసేన నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల వర్షాలకు పలు ప్రాంతాల్లో రైతుల వద్ద ధాన్యం తడిసిపోయిందని, వాటిని ప్రభుత్వం వెంటనే కొనుగోలుచేసి సొమ్ములు చెల్లించాలని అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, గుండుబోగుల పెద్దకాపు, మల్లిపూడి సత్తిబాబు, రాపాక నవరత్నం కోరారు.

పెట్రో ఉత్పత్తులు లూజు అమ్మకాలు జరిపితే చర్యలు

అమలాపురం టౌన్, మే 18: పెట్రోలు బంకులతో పాటు ఇతర దుకాణాల్లో పెట్రోల్, డీజిల్‌ను లూజుగా విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ హెచ్చరించారు. మోటారు సైకిళ్లు, మోటారు వెహికల్స్‌కు బిగించిన ట్యాంకుల్లో మాత్రమే పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరపాలన్నారు. అలా కాకుండా కేన్లలో, ఇతర పరికరాల్లో లూజుగా పెట్రోల్ విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఉత్తర్వులు ఉల్లంఘించిన పెట్రోల్ బంకు డీలర్లు, ఇతర వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ద్రాక్షారామ, మే18: చికిత్సపొందుతూ యువకుడి మృతి చెందాడు. బీమక్రోసుపాలేనికి చెందిన పిల్లి సాయి చరణ్(23) ఇంటర్ చదివాడు. ఉద్యోగం, ఉపాధి లేకపోవడంతో బెండతోట సాగు చేశాడు. నష్టాలు రావడంతో ఈనెల11న పొలానికి ఉపయోగించే కలుపు మందు తాగాడు. బంధువులు అతడిని కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ డి.వెంకటరమణారావు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

పర్యటన వాయిదా

మలికిపురం, మే 18: నియోజకవర్గంలో చేపట్టిన కృతజ్ఞతా పర్యటన వాయిదా వేసినట్టు రాజోలు కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ తెలిపారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికీ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సూచనతో పర్యటన వాయిదా వేసినట్టు తెలిపారు.

ఘనంగా అమ్మవార్ల జాతరలు

అంతర్వేది, మే 18: అంతర్వేది పల్లిపాలెం, శృంగవరప్పాడు గ్రామంలో బలుసులమ్మ, శ్రీకాళికాదేవి, కనకదుర్గమ్మ, ఆదిగంట్లమ్మ, మరిడి మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

నేడు వెంకన్న శాంతి కల్యాణం

యానాం, మే 18: యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాసం శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం శాంతికల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు అర్చకులు పెద్దింటి రఘురామవినోదాచార్యులు తెలిపారు. గుబ్బల పరంజ్యోతి దంపతులు శనివారం ఉదయం 8.30గంటలకు శాంతికల్యాణ పూజలు ప్రారంభిస్తారన్నారు.

నేడు కోర్సులపై అవగాహన సదస్సు

యానాం, మే 18: పుదుచ్చేరిలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో కోర్సులపై అవగాహన కల్పించేందుకు ఉన్నత విద్యాశాఖ ఆదివారం ఉదయం 10 నుంచి 12గంటల వరకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు విద్యాశాఖ డైరెక్టర్ అమన్‌శర్మతెలిపారు. కళాశాలల చరిత్ర, కళాశాలలు అందించే కోర్సులు, మౌలికసదుపాయాలు, సాధించిన విజయాలు, ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలపై వివరిస్తారన్నారు.

కొత్తపేట సబ్‌జైలు తనిఖీ

కొత్తపేట, మే 18: కొత్తపేట సబ్‌జైలును శనివారం సీనియర్ సివిల్ జడ్జి పి.రమాణారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా జైలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖైదీలు మానసిక పరివర్తనకు తీసుకోవాల్సిన చర్యలు గురించి సూపరింటెండెంట్‌కు పలు సూచనలు చేశారు. ఖైదీలతో మాట్లాడి అందుతున్న ఆహారం తదితర సౌకర్యాల గురించి ఆరా తీశారు. మానసిక పరివర్తన చెందాలని ఖైదీలకు సూచించారు. కార్యక్రమంలో సబ్ జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన బాలబాలాజీ దేవస్థానం



బాలబాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, మే 18: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. దేవస్థానంలో నిర్వహించిన లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని శనివారం 4,193 మంది దర్శించుకుని, 3,278మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.4,31,508 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

స్వామివారి హుండీ కానుకల లెక్కింపు: శ్రీబాలబాలాజీ స్వామివారి హుండీల లెక్కింపు ఈనెల27వ తేదీ ఉదయం 9 గంటలకు జరుగుతుందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. లెక్కింపు కార్యక్రమానికి భక్తులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

వినూత్న రీతిలో చంటి, బిడ్డ సారె పంపిణీ



ఆత్రేయపురం, మే 18: ఎన్నికల వేడి చల్లారింది. కౌటింగ్‌లో ఫలితాల కోసం పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఓ అభిమాని పార్టీ సింబల్‌తో చంటిబిడ్డ సారెను బంధుమిత్రులకు పంపిణీ చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. వాడపల్లి జనసేన పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పైడికొండల చినకాపు కుమారుడు వీరబాబుకు ఇద్దరు కవల అబ్బాయిలు జన్మించారు. ఇద్దరు మనవల్లు పుట్టారనే సంబరంతో సారెను బంధుమిత్రులకు పంపిణీ చేశారు. లొల్ల వద్ద చేదస్తం షాపులో 9రకాల స్వీట్స్‌తో కూడిన సారెను జనసేన సింబల్‌తో ఉన్న బ్యాక్సుతో ప్యాక్ చేసి బంధుమిత్రులకు పంచారు.

కోకో గింజలకు కనీస ధర కల్పించాలి



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

అంబాజీపేట, మే 18: కోకో పంటకు ప్రభుత్వం కనీస ధర కల్పించి ఆదుకోవాలని కోకో రైతులు కోరారు. స్థానిక కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో కోకో రైతులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కోకో పంట పండించడంలో మెలుకువలు, కాయ కోత అనంతరం గింజలను నాణ్యతగా తయారీ, మార్కెటింగ్ విధానాలపై రైతులు అభిప్రాయాలు వెల్లడించారు. కోకో గింజల దిగుబడి గణనీయంగా తగ్గిపోవడం వల్ల కోకో గింజల ధర ఇటీవల కాలంలో నెమ్మదిగా పెరుగుతుందని, అయితే ఈ ధరల వ్యత్యాసంతో దిగుబడులు లేక రైతులు పంటను పండించడంలో పలు అనుమానాలకు లోనవుతున్నారన్నారు. ఇప్పటికే సాగు కష్టతరం కావడంతో నష్టాలు భరించలేక చాలా మంది రైతులు కోకో పంటను కోనసీమ వ్యాప్తంగా తొలగించారని తెలిపారు. పెరిగిన ధరలతో తిరిగి వారిలో కోకో పంటను కాపాడుకోవాలని ఆలోచనకు వచ్చారన్నారు. రైతులు ఐకమత్యంగా ఉండి కోకో పంటను కాపాడుకోవాలని సూచించారు. రైతులు ముత్యాల జమీలు, దొంగ నాగేశ్వరరావు, సమయమంతుల పండు, చేకూరి సూర్యనారాయణరాజు, అడ్డాల గోపాలకృష్ణ, రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోండి

అమలాపురం టౌన్, మే 18: ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు తూర్పుగోదావరి జిల్లా బీసీ స్టడీ సర్కిల్‌లో ఈనెల25 నుంచి ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు స్టడీ సర్కిల్ సంచాలకుడు పిల్లి సత్యరమేష్ తెలిపారు. గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు. పతీ సబ్జెక్టుకు సంబంధించి ప్రాక్టీసు టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారు. గ్రంథాలయ సౌకర్యం, స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంటాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు స్టైపండ్‌తో పాటు బుక్ అలవెన్స్ అందజేస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యర్థులు టూ ది డైరెక్టర్ ఏపీ బీసీ స్టడీ సర్కిల్, నియర్ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం-533103కు దరఖాస్తులు చేసుకోవాలని సత్యరమేష్ కోరారు. బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో 77మంది అభ్యర్థులకు 26మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ 9393934825, 8639447339ను సంప్రదించాలన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా వీడ్కోలు వేడుకలు



అమలాపురం రూరల్, మే 18: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సి డేటా సైన్స్ కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థులకు జూనియర్లు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీ ప్రాధాన్యతను గుర్తించి ఇంజనీరింగ్‌లో చేర్చడం జరిగిందని ప్రిన్సిపాల్ రామారావు తెలిపారు. తొలిసారిగా కోర్సును పూర్తి చేసుకుని బయటికి వెళ్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ చిన్నం రంజిత్‌కుమార్, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, ఫిజికల్ డైరెక్టర్ కరాటం రవిసుధీర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: బాక్
శ్రీలలిత	: మిరల్
శేఖర్ స్క్రీన్-1	: కృష్ణమ్మ
శేఖర్ స్క్రీన్-2	: దర్శిని
రమా	: ఆ ఒక్కటి అడక్కు
గణపతి	: రత్నం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కింగడమ్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: నటరత్నాలు

సమయాన్ని వృథా చేయవద్దు

ఉప్పలగుప్తం, మే 18: వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయవద్దని ఎంఈవో సత్తి సత్యకృష్ణ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. భీమనపల్లి శాఖా గ్రంథాలయంలో శనివారం ఆయన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం ద్వారా విజ్ఞాన్ని పొందాలన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తితో పాల్గొన్నారు. సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలవేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, దేశనాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూన్7వరకు విజ్ఞాన శిబిరం కొనసాగుతుందని గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషకుమార్ తెలిపారు.

బీవీసీలో విద్యార్థుల ఆవిష్కరణల ప్రదర్శన



అల్లవరం, మే 18: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థుల ఆవిష్కరణల ప్రదర్శన జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.శ్రీకాంత్ నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలో కళాశాల కార్యదర్శి బోనం కనకయ్య, ఛైర్మన్ బోనం కృష్ణసతీష్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రదర్శనలను ప్రారంభించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యంతో బ్యాటరీ కారును, ప్రత్యేక వీల్‌ఛైర్‌ను ప్రదర్శించారు. ముఖ కవలికలను బట్టి తల ఎటుతిప్పితే అటు నడిచే వీల్‌ఛైర్‌ను ప్రదర్శించారు. ఈఆవిష్కరణలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ ఆలపాటి రామకృష్ణ, ఆకుల ఏసుప్రసాద్, కె.శివన్నారాయణ, డాక్టర్ ఏ.ప్రవీణ్, డాక్టర్ బీఎస్ఎస్ మూర్తి, డాక్టర్ పి.సుబ్బారావు, డాక్టర్‌శ్రీపాద రామకృష్ణ పాల్గొన్నారు.

23న బుద్ధ జయంతి వేడుకలు



వేడుకల కరపత్రాలను ఆవిష్కరించిన లోక్ తదితరులు

అమలాపురంటౌన్, మే18: ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, త్రిరత్న బుద్ధవిహార్ ఆధ్వర్యంలో ఈనెల23న బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు బీఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీబీ లోక్ తెలిపారు. జిల్లాశాఖ అధ్యక్షుడు కాశి రాంబోధి ఆధ్వర్యంలో శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో బుద్ధ జయంతి వేడుకల లోగో, కరపత్రాలను ఆవిష్కరించారు. బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో 23వతేదీ ఉదయం నుంచే బౌద్ధ భిక్షువులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రముఖులెందరో హాజరయ్యే జయంతి వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఈవీవీ సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో బీఎస్ఐ ప్రతినిధులు ములపర్తి సత్యనారాయణ, బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, కవల రమేష్ సాధనాల సత్యనారాయణ, బొంతు బ్రహ్మయ్య, కాశి వెంకట్రావు, గోసంగి ఆనందరావు, ఉండ్రు శ్యామలరావు, కోడూరి రామమూర్తి, జల్లి రంగారావు, పులిదిండి సత్యనారాయణ, నాగాబత్తుల కొండబాబు పాల్గొన్నారు.

సమస్యాత్మక పల్లంలో కార్డన్ అండ్ సెర్చ్

10 ఆటోలు, 37 మోటారు సైకిళ్లు సీజ్



చెయ్యేరులో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, మే 18: ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి శనివారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. విస్తృతంగా సోదాలు నిర్వహించి రికార్డులు లేని పది ఆటోలు, 37మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ జూన్6వరకు ఎన్నికల కోడ్ జిల్లాలో అమలులో ఉంటుందన్నారు. శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠమైన ఫెన్సింగ్‌తో భద్రతను మరింత పెంచామన్నారు. ఓట్ల లెక్కింపు రోజున ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఓట్ల లెక్కింపు దృష్ట్యా ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించాలి

అమలాపురం రూరల్, మే 18: జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి సమీపంలో ఉన్న పాఠశాలలు, భవిత కేంద్రాల్లో నమోదు చేయించాలని రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ గనీ పేర్కొన్నారు. అమలాపురం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ప్రత్యేక ఉపాధ్యాయులకు శనివారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అబ్దుల్ గనీ మాట్లాడుతూ 21రకాల వైకల్యాలకు సంబంధించిన పిల్లలను గుర్తించే విధానాన్ని వివరించారు. జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే మండలాల వారీగా డేటాను సేకరించామన్నారు. ఈనెలలో ఇప్పటి వరకు జిల్లాలో 137మంది పిల్లలను గుర్తించామన్నారు. జూన్ 7వరకు పిల్లలను గుర్తించే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఎంఈవో ఎస్.దుర్గాదేవి, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బ్రహ్మంగారి ఆరాధనా మహోత్సవం

ముమ్మిడివరం, మే 18: ముమ్మిడివరం నగర పంచాయతీ శ్రీబాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో వీరబ్రహ్మంగారి ఆరాధనా మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో బ్రహ్మంగారి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలోని శ్రీపెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల సమాధులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం జరిగింది. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.